# ప్రేక్షకాదరణ పొందిన 'ప్రజానాయకుడు ప్రకాశం'



న్యూస్‌టుడే

రవీంద్రభారతి, ఆగస్టు 16: స్వయం ప్రతిభతో అతిసామాన్యమైన వ్యక్తి ఉన్నతశిఖరాలు అధిరోహించి, దేశం కోసం జీవితాన్ని త్యాగం చేసిన నిస్వార్థరాజకీయ నాయకుడు ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం జీవితం చరిత్రను నాటకంగా మలిచి బుధవారం నాడు రవీంద్రభారతి రంగస్థలపై ప్రదర్శించి రంగస్థల కళాకారుల, ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంది నగరానికి చెందిన రసరంజని సంస్థ.

రసరంజని గత ఎనిమిదేళ్లుగా స్వయంగా ఉత్తమ నాటకాలు ప్రయోగం, మంచినాటకాలు ప్రదర్శించే సమాజాలకు ప్రోత్సాహం, నటనలో శిక్షణ, నాటకరంగం తన కాళ్లమీద తాను నిలబడాలనే తపనతో కష్టనష్టాలకు ఓర్చి కార్యక్రమాలు నిర్వహిస్తోంది. టంగుటూరి ప్రకాశం 129వ జయంతిని పురస్కరించుకుని ప్రజా నాయకుడు ప్రకాశం పేరున ప్రకాశం జీవితగాథను నాటకీకరించి రంగ రంగస్థలంపై ప్రదర్శించి నాటకం అనే దానికి నిర్వచనం చెప్పారు రసరంజని సంస్థ కళాకారులు. టంగుటూరి ప్రకాశం బాల్యం, చిన్నతనంలోనే నాటకాలు వేయడం, కొడుకు న్యాయవాది కావాలని ప్రకాశం తల్లి సుబ్బమ్మ ఆకాంక్ష, గురువు ఇమ్మనేని హనుమంతరావునాయుడు రాజమండ్రిలో ప్రకాశంపంతులును ఉంచి చదువుసంధ్యలు చెప్పించడం, లా చదువు, ఉన్నత చదువులకోసం లండన్ ప్రయాణంతోపాటు తల్లి తనయుల ప్రేమానురాగాల సన్నివేశాలను రంగస్థలంపై అద్భుతంగా పండించారు. ప్రకాశం తల్లి సుబ్బమ్మగా ప్రఖ్యాత పౌరాణిక నటుడు బుర్రా సుబ్రహ్మణ్యం తన నటనకు ప్రేక్షకులు జేజేలు అందించారు. బాధాకర సన్నివేశాల్లో సైతం ప్రేక్షకుడ్ని ఆర్ద్రతకు గురిచేసి ప్రశంసలు పొందారు. నాటకం రెండో భాగం ప్రకాశం హైకోర్టు అడ్వకేట్‌గా బాధ్యతలు నిర్వర్తించడం, 1928లో సైమన్ మనదేశానికి అగమనం, సైమన్ గోబ్యాక్ అంటూ నినాదాలు చేస్తూ అయనకు ఎదురుగా కాల్చుమని గుండె చూపే సన్నివేశం, 1930లో ఉప్పు సత్యాగ్రహం వంటి సన్నివేశాలు రంగస్థలంపై చూపడంలో దర్శకుడు కృతకృత్యులయ్యారు. ప్రకాశం రాజకీయ నాయకునిగా పైకెదగడం, ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టడం . అటు తర్వాత ఆంధ్రప్రదేశ్ అవతరణతో ప్రకాశం అంతిమ ప్రస్థానం ముగిసినట్టుగా నాటకంలో చక్కగా సహజత్వానికి దగ్గరగా చూపారు. నాటకం రచన దర్శకత్వం పోకడలు జాతీయ స్థాయి ప్రమాణాలు కలిగిఉన్నాయనడంలో సందేహం లేదు. ఇందులో ప్రకాశంతల్లిగా నటించిన బుర్రా సుబ్రహ్మణ్యం, ప్రకాశం గురువుగా దుగ్గిరాల సోమేశ్వరరావు, చిలమర్తి లక్ష్మీనరసింహంగాగా క్రమధాటి వెంకటేశ్వర శర్మ, పెద్ద ప్రకాశంగా చాట్ల శ్రీరాములు వంటివారు తమ ప్రతిభను మరోసారి చాటి ప్రేక్షకుల మన్ననలు పొందారు. ఈనాటకంలో నటులంతా ఒకరితో మరొకరు పోటీపడి నటించి మెప్పించారు. రచయిత, దర్శకుడు మొదలి నాగభూషణ శర్మ, దాదాపు 50 మంది కళాకారులతో చేయించిన కృషి ఫలించిందని చెప్పవచ్చు. నభూతో భవిష్యతిగా జరిగిన ప్రదర్శనలో నేపథ్యానికి పద్య సంగీతం బుర్రా సుబ్రహ్మణ్య శాస్త్రి, పద్యగానం క్రమధాటి వెంకటేశ్వర శర్మ, గేయగానం, నిర్వహణ ఎస్ మోహన్, సెట్స్ సురభి పూర్ణచంద్రరావు, సెట్ అండ్ కాస్ట్యూమ్స్‌డిజైన్ ప్రయోగ నిర్వహణ గరిమెళ్ల రామ్మూర్తి నిర్వహించారు.

గురువారం, 17 ఆగస్టు 2000 ఆంధ్రభూమి